కౌలు రైతులకు కష్టకాలం

- ఏటేటా పెరుగుతున్న కౌలు ధరలు
- ప్రభుత్వ నుంచి అందని పెట్టుబడి సాయం
- కౌలు కార్డుల జారీ, రుణాల మంజూరులో నిర్లక్ష్యం
- చివరకు పంటలు పండక అప్పుల పాలు


గార్లేయపురంలో కౌలుకు సాగు చేసిన ఉల్లి పైరు

కర్నూలు(రూరల్): వ్యవసాయంపై మక్కువతో కొందరు భూమిని కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నారు. అయితే ఈ క్రమంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వక, ప్రభుత్వం నుంచి సాయం అందక పెట్టుబడులు కోసం అవస్థలు పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తున్నారు. చివరకు పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడం, మద్దతు ధర లభించకపోవడం ఇలా వివిధ కారణాలతో అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు.

కోడుమూరు నియోజకవర్గంలో పరిధిలోని గూడూరు, సి.బెళగల్, కర్నూలు రూరల్, కోడుమూరు మండలాల్లో సుమారు 3,835 మందికి పైగా కౌలు గుర్తింపు కార్డులు పొందిన రైతులు ఉన్నారు. వీరికి గతేడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోయినా మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు పత్తి, మొక్కజొన్న, ఉల్లి, టమాట, ఆముదం, వేరుశనగ వంటి పలు రాకల పంటలు సాగు చేశారు.

కౌలు కార్డుల జారీలో ఇబ్బందులు

నాలుగు మండలాల పరిధిలో ఈ సంవత్సరం 3950 కౌలు కార్డుల జారీ లక్ష్యం కాగా ఇప్పటివరకు 2981 మందికి కార్డులు మంజూరు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఓ వైపు భూ యజమానులు కౌలు రైతులకు అగ్రిమెంటు చేసేందుకు ముందుకు రాకపోవడం, మరోవైపు నిబంధనల పేరుతో కార్డుల జారీలో అధికారులు జాప్యం చేస్తుండటంతో అరకొర మందికే కౌలు కార్డులు అందుతున్నాయి. కూటమి సర్కారు ఏర్పడ్డాక ఇప్పటి వరకు రైతులకు ఒక్క రూపాయి కూడా విదిల్చింది లేదు. దీంతో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేయల్సిన పరిస్థితి నెలకొంది.

పెరిగిన కౌలు ధరలు

నియోజకవర్గంలో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే వారిలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారు. అయితే భూముల యజమానులు ముందస్తు కౌలు అడుగుతుండటంతో పాటు ఏటేటా కౌలును పెంచుతుండటంతో కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు మండలంలో ఎక్కువ భాగం తుంగభద్ర ఆయకట్టు కింద ఉండటం, మరికొన్ని భూములకు కేసీ కెనాల్, హంద్రీ – నీవా నుంచి నీరు అందుతుండటంతో భూయజమానులు కౌలు అధికంగా డిమాండ్ చేస్తున్నారు. సాగు చేసే పైర్లను బట్టి ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు కౌలు ధరలు ఉన్నాయి. అయితే వరి పైరుకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు, మెట్ట పైర్లు జొన్న, మొక్కజొన్న, మినుము, శనగ వంటి వాటికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు, మిరప పైరుకు అత్యధికంగా రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు కౌలు చెల్లించాల్సి ఉంది. ఇంత మొత్తం చెల్లించి పంటలు సాగు చేస్తే చివరకు దిగుబడులు రాక, మద్దతు ధర లభించక కౌలు రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుంది.

నాడు అన్ని విధాలుగా ఆదుకున్న జగన్ సర్కారు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో వ్యవసాయం పండుగలా సాగింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కౌలు రైతులను అన్నివిధాలుగా ఆదుకున్నారు. భూ యజమానుల హక్కులకు భంగం కలగకుండా 11 నెలల కాలానికి సాగు ఒప్పందం చేస్తూ కౌలు చట్టాన్ని సవరించి ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి ఒకసారి జారీ చేసిన కార్డులను మళ్లీ యజమాని అంగీకారంతో రెన్యూవల్ చేసుకొనే వీలు కల్పించారు. అంతేగాకుండా బ్యాంకర్లతో మాట్లాడి కౌలు రైతులకు పంట రుణాలను అందించడంతో పాటు రైతు భారోసా, పంటల బీమా పరిహారం అందించి ఆదుకున్నారు. ప్రస్తుతం కూటమి సర్కారు ఇవేమీ పట్టించుకోకపోవడంతో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

పెట్టుబడి సాయం అందించాలి



నేను గతేడాది ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని ఉల్లి, వంకాయ, టమాట, పైర్లు సాగు చేశాను. కౌలు కార్డు కూడా తీసుకున్నాను. పైర్లు పూర్తయి పంటకోత అనంతరం రూ.లక్ష దాకా నష్టం వచ్చింది. ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టపోవాల్సి వస్తోంది. అనేక సమస్యలు ఎదుర్కొని అప్పులు చేసి మరీ వ్యవసాయం చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– బి.భాస్కర్, కౌలు రైతు, గార్గేయపురం

ప్రభుత్వం ఆదుకోవాలి



గత రెండు సంవత్సారాల నుంచి పొలం కౌలుకు తీసుకోని పంటలు సాగు చేస్తున్నాను. కౌలు గుర్తింపు కార్డు మంజూరైంది. అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు అమలు చేస్తున్నారో, లేదో వ్యవసాయ శాఖ అధికారులు తెలియపరచడం లేదు. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేయడం లేదు. ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలపై దృష్టి సారించి ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

– టి.విశ్వనాథ్, కౌలు రైతు, బి.తాండ్రపాడు

క్లుప్తంగా

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు


మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న ఎంఈఓ ఆదామ్‌బాష

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ ఆదామ్‌బాష హెచ్చరించారు. ఆయన గురువారం మండల పరిధిలోని బురాన్‌దొడ్డిలో పర్యటించి అక్కడున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంట నిర్వాహకులతో మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంట ఉపాధ్యాయులు, ఉన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి


విజేయుడు దంపతులను సన్మానిస్తున్న డీసీఓ శ్రీదేవి, ఉపాధ్యాయులు

సి.బెళగల్: ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది సమన్వయంతోనే గురుకుల సంస్థల అభివృద్ధి సాధ్యమవుతుందని కర్నూలు జిల్లా గురుకులాల సమన్వయకర్త (డీసీఓ) శ్రీదేవి అన్నారు. మండల కేంద్రం సి.బెళగల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్, వైస్ ప్రిన్సిపాల్ విజేయుడు గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యపకులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విజేయుడుకు పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీఓ ఉపాధ్యాయ వృత్తి, సేవలు, ప్రజలలో గుర్తింపు తదితర అంశాలపై మాట్లాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన విజేయుడు, ఉషారాణి దంపతులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో డీసీఓ, అధ్యపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు.

ఎంఈఓగా సుబ్బరామిరెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈఓ-1 సుబ్బరామిరెడ్డి

గడివేముల: మండల విద్యాశాఖాధికారి-1గా సుబ్బరామిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న ఎంఈఓ కోటయ్య ఇన్‌చార్జ్ కావడంతో బండిఆత్మకూరు ఈర్నపాడు పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుబ్బరామిరెడ్డికి ఉన్నతాధికారులు ఎంఈఓ-1గా పూర్తి బాధ్య తలు అప్పగించారు. ఈమేరకు ఆయనను ఎంఈఓ-2 రాజేంద్ర ప్రసాద్‌తో పాటు పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఇదాయతుల్లా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో సమయం ఆదా

కల్లూరు: వ్యవసాయంలో సాంకేతికతతో సమ యం ఆదా అవుతుందని, రాష్ట్రంలో వ్యవసాయాన్ని ఆధునీకరించేందుకు కూటమి ప్రభు త్వం కృషిచేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బ న్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామంలో కిసాన్ డ్రోన్ పథకం కింద కల్లూరు మండలం లక్ష్మీపురం, ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామాల రైతులకు రాయితీపై డ్రోన్‌లను పంపిణీ చేశా రు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు సాలురెడ్డి, మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘భారత్ కి సంతాన్’కు ఎంపిక

కర్నూలు కల్చరల్: నేషనల్ యూత్ ప్రాజెక్టు వారు నిర్వహిస్తున్న భారత్ కి సంతాన్ కార్యక్రమానికి జిల్లా నుంచి ఎంపికైన టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన కూచిపూడి విద్యార్థినులను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ గురువారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. దక్షిణ భారత దేశం నుంచి మొత్తం 14 మందిని ఎంపిక చేయగా, అందులో కర్నూలు నగరానికి చెందిన లిఖిత, సత్యశ్రీ, మధుహాసిక చోటు పొందడం జిల్లాకే గర్వకారణమన్నారు. వీరు నేషనల్ యూత్ ప్రోగ్రాం వారు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటూ దేశంలోని వివిధ భాషలు, సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తూ ప్రదర్శనలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగే టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ కేవీ భార్గవ్‌కుమార్ 14 దేశాలతో కూడిన సౌత్ ఏషియా సమైక్యత సంస్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

2న చిత్రలేఖన పోటీలు

కర్నూలు కల్చరల్: జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభల సందర్భంగా ఈనెల 2వ తేదీ ఉదయం 10 గంటలకు ఓల్డ్‌బస్టాండ్ సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. సీనియర్ విభాగంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ‘డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం’, జూనియర్ విభాగంలో 6, 7 తరగతుల విద్యార్థులకు ‘మొక్కల సంరక్షణ’ అనే అంశాలపై పోటీలు ఉంటాయని వెల్లడించారు.

శక్తి యాప్‌పై విస్తృత ప్రచారం


శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చూపుతున్న నర్సింగ్ విద్యార్థినులు

కర్నూలు: మహిళల భద్రతకు శక్తి యాప్, వాట్సాప్ సేవలపై పోలీసులు జిల్లా అంతటా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర సమయాల్లో కాల్ చేసినా, మెసేజ్ చేసినా స్పందించేలా శక్తి వాట్సాప్ నంబర్‌ను రూపొందించారని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ జిల్లా అంతటా పోలీస్ స్టేషన్ల వారీగా గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు యాప్ పనితీరును వివరించారు. అలాగే బాలబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విస్తృత అవగాహన కల్పించారు. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల విద్యార్థులకు రక్షణ, భద్రత ఉంటుందని, ప్రతిఒక్కరూ యాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలని శక్తి టీమ్ బృందాలు వివరించాయి. అలాగే డయల్ 112, 181, 1098, 1930 టోల్‌ఫ్రీ నంబర్ల ఉపయోగాలు, సోషల్ మీడియా ప్రభావం, చదువుకు ఉన్న ప్రాముఖ్యత, ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ నిబంధనలు, బాల్య వివాహాలు, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించారు.

వాడీవేడిగా నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

- అక్రమ నిర్మాణాలపై అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు


సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

కోడుమూరు రూరల్: గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ విజయలక్ష్మి గురువారం నిర్వహించిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశానుద్దేశించి కౌన్సిలర్లు మాట్లాడుతూ.. నగర పంచాయతీ పరిధిలో అనుమతుల్లేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అధికారులేమి చేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలు జరుపుతున్న వారికి ఇది వరకే నోటీసులు జారీ చేశామని, మరొకసారి పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ లక్ష్మన్న, కౌన్సిలర్లు దస్తగిరి, పద్మావతి, దాసు, బజారి, కలామ్‌బాషా, బుడ్డాంగలి, ఎల్లనాగమ్మ, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం


టి.మోక్షిత్ (ఫైల్)

కల్లూరు: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామ పరిధిలోని స్కందాన్షి వెంచర్‌కు చెందిన బాలుడు అదృశ్యమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్కందాన్షి వెంచర్‌లో నివాసముంటున్న టి.మోక్షిత్ లక్ష్మీపురం గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం స్కూల్ నుంచి ఇంటికి భోజనానికి వచ్చాడు. భోజనం చేసిన తరువాత స్కూల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. సాయంత్రం 5.30 గంటలైనా రాకపోయేసరికి తండ్రి టి.సురేష్ స్కూల్ దగ్గరికి వెళ్లి ఇంకా ఇంటికి రాలేదని పిల్లవాని గురించి విచారించాడు. అయితే మోక్షిత్ మధ్యాహ్నం స్కూల్‌కు రాలేదని స్కూల్ వాళ్లు తెలిపారు. అంతటా వెతికినా కనబడకపోయే సరికి ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు ఏఎస్ఐ విజయరాజు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


బురాన్‌దొడ్డిలో సావిత్రిని సన్మానిస్తున్న ఎంఈఓలు జ్యోతి, ఆదాంబాషా, సర్పంచ్ రామాంజనేయులు

సి.బెళగల్: సమాజంలో ఉపాధ్యాయ వృతి గౌరవప్రదమైనదని, ప్రతి ఉపాధ్యాయుడు అందుకు అనుగుణంగా విద్యా భోదన సాగించాలని ఎంఈఓలు జ్యోతి, ఆదాంబాషా అన్నారు. మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం పీఎస్‌హెచ్‌ఎం సావిత్రి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమంను నిర్వహించారు. ఎంఈఓలు ఉపాధ్యాయ వృత్తి, సేవలు, ప్రజలలో గుర్తింపు తదితర అంశాలపై మాట్లాడారు. గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, ఎస్ఎంసీ చైర్మన్ రాజు, క్లస్టర్ హెచ్‌ఎం సత్యవేదమ్మ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బురాన్‌దొడ్డి పాఠశాలకు సావిత్రి చేసిన సేవలను గుర్తు చేసి అభినందించారు. అనంతరం పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం సావిత్రిని పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎంలు రేవుల శ్రీనివాసులు, మునిస్వామి, కిషోర్‌కుమార్, హనుమన్న, సోమశేఖర్, ఆయా పాఠశాలల టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై 3న అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కిడ్నీ వ్యాధులపై ఆగస్టు 3న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటల నుంచి సదస్సు ప్రారంభమవుతుందన్నారు. సదస్సులో కిడ్నీ వ్యాధులు–పోషకాహారం పాత్ర గురించి నెఫ్రాలజిస్టు డాక్టర్ శ్రీధరశర్మ వివరిస్తారన్నారు.

నేడు స్పౌజ్ పింఛన్ల పంపిణీ

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 189 మంది వితంతువులకు కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరైనట్లు కర్నూలు ఎంపీడీఓ జి.రఘునాథ్ గురువారం తెలిపారు. కర్నూలు మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాలులో శుక్రవారం కొడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి చేతులమీదుగా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఇరువర్గాల ఘర్షణ

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడు గ్రామంలో తాగునీరు సరఫరా విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. బుధవారం రాత్రి గ్రామంలో ఘటన జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన సర్పంచ్ మరిది రామాంజి గ్రామంలో తాగునీరు సరఫరా చేస్తుంటాడు. ఇందులో భాగంగానే బుధవారం రాత్రి గ్రామంలో ఓ సామాజిక వర్గానికి చెందిన కాలనీకి మంచినీళ్లు వదిలేందుకు వెళ్లాడు. నెలకు పైగా మా కాలనీకి మంచినీరు ఎందుకు వదలడం లేదని స్థానికులు ప్రశ్నించారు. ఈ క్రమంలో మాటామాట పెరిగి రామాంజి మరో వర్గానికి చెందిన ఆంజనేయ, గాదిలింగ, శంకర్ మరికొందరు పరస్పరం దాడులు చేసుకున్నారు. బుధవార అర్ధారాత్రి పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరింది. ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. గురువారం గ్రామ పెద్దల సమక్షంలో వారు రాజీ అయ్యారు.

క్రీడా మైదానాలను అభివృద్ధి చేయండి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలను బట్టి క్రీడామైదానాలను అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన సీపీఎం మండల కార్యదర్శి నాగన్నతో కలిసి మండల కేంద్రం ఓర్వకల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ప్రిన్సిపాళ్లను, మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలల్లో ప్రధానంగా ఆటస్థలాలు, మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, స్థానిక మోడల్ స్కూల్, కస్తూర్బా స్కూళ్లలో విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలాలు వున్నప్పటికీ వాటిని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం వెనుకబడిందని తెలిపారు. జాతీయ రహదారి నుంచి ఆయా స్కూళ్లకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదని, ఉన్నమట్టి రోడ్డుపైనే రాకపోకలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే మట్టి రోడ్డు బురదమయమై విద్యార్థులు స్కూళ్లకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మల్లేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై అవగాహన


పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఆర్‌పీ రమేష్ నాయుడు

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాలోవత్ అనిత, పెద్దస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి స్టేట్ రిసోర్స్ పర్సన్లు ఖాజా బేగ్, రమేష్ నాయుడు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పదో తరగతి పరీక్షల కోసం బ్లూప్రింట్లు, మోడల్ పేపర్లు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. నేషనల్ అసెస్‌మెంట్ సెంటర్(పీఏఆర్ఏకెహెచ్) పరాక్ సూచనల మేరకు పదో తరగతి పరీక్షలలో సవరణ చేయబడినట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ పరీక్షలు రాసే విద్యార్థులు బ్లూప్రింట్లు, మోడల్ పేపర్లను సద్వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మద్దిలేటి సూచించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు మధుసూదన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచే వరకు పోరాటం


రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులు

కోడుమూరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు పెంచే వరకు పోరాటం ఆపేది లేదని సీఐటీయూ మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గఫూర్‌మియ్యా మాట్లాడుతూ.. ఏళ్లతరబడి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నా జీతాలు పెరగకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. జీతాలు పెంచాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పదివేల జీతం ఇవ్వాలని మాత్రమే జీఓ ఉందంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబాలను పోషించుకునేందుకు కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి కార్మికుల జీతాలను పెంచాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు వీరన్న, పంచాయతీ కార్మికులు సంజప్ప, మునిస్వామి, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన


డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): డెంగీ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఇంటితో పాటు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంజూష వివరించారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా.. డెంగీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కలిగిస్తూ ఆరోగ్య సిబ్బంది, స్కూల్ విద్యార్థులు పంచలింగాల గ్రామంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ‘డెంగీని ఓడించండి, పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి’ అనే అంశాలపై ఆరోగ్య సిబ్బంది, స్కూల్ విద్యార్థులు నినాదాలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. డెంగీ నివారణలో ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది భాగస్వామ్యం కావాలని తద్వారా దోమలను నిర్మూలించవచ్చన్నారు.


గడివేముల-పెసరవాయి రోడ్డు దుస్థితి

అధ్వానంగా పెసరవాయి రోడ్డు

గడివేముల: మండలంలోని కొన్ని గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఆ రోడ్లలో ప్రయాణం చేయాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి వెళ్లే రహదారిలోని కేసీ కాల్వ సమీపంలో రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. అత్యవసర సమయాల్లో 108, అంబులెన్స్ తదితర వాహనాలు వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. వర్షాలు కురిస్తే గోతుల్లో నీరు చేరిన వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనబడక ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దుదాం


మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): కర్నూలు నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దుదామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆగస్టు 1 నుంచి నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సరికొత్త విధానం తీసుకొస్తున్నట్లు చెప్పారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు. వ్యర్థాల సేకరణకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి ట్రాక్టర్‌కు రూ.500, టిప్పర్‌కు రూ.వెయ్యి చొప్పున యజమానులు రవాణా చార్జీలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీటి కోసం ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి సచివాలయాల పరిధిలో ముగ్గురు కార్యదర్శులు బృందంగా ఏర్పడి క్షేత్రస్థాయిలో కంపోస్టు, వేస్టేజ్ నిర్వహణను పర్యవేక్షించాలన్నారు. త్వరలోనే వార్డులకు నోడల్ అధికారులను నియమిస్తామని వారి ద్వారా అన్ని పనులను పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డ్రైనేజీ కాల్వల్లో తాగునీటి పైపులైన్లను తొలగించాలన్నారు. నగర ప్రజలు సహకరించాలని, క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు తోడ్పాటు అందించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయంలో ఒకే ఒక్కరు!


గొల్లలదొడ్డి సచివాలయంలో ఉదయం 10:50 గంటలకు విధుల్లో ఉన్న ఏకైక ఉద్యోగి

సి.బెళగల్: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు గొల్లలదొడ్డి గ్రామ సచివాలయంలో గురువారం ఉదయం 10:50 గంటల వరకు వ్యవసాయ సహాయకులు ఉమాదేవి మాత్రమే విధులలో ఉన్నారు. ఈ సచివాలయంలో 8 మంది ఉద్యోగులు ఉండగా, ఒక్కరు మాత్రమే సమయానికి సచివాలయం చేరుకోగా, మిగతా ఉద్యోగులు ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్తారో తెలియదని గ్రామస్తులు అంటున్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోను ఇదే పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు అంటున్నారు. ఉద్యోగులను పర్యవేక్షించాల్సిన మండల అధికారులు సైతం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా పల్లెల్లో పనిచేసే ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.